ప్రజాశక్తి
గురువారం 2 మార్చి 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

యువకుల ఘాతుకం

- మద్యం మత్తులో వీరంగం - ఇద్దరు వాచ్‌మెన్‌ల హత్య
- ఇనుప రాడ్డుతో పలువురిపై విచ్చలవిడిగా దాడి
- పలు దుకాణాల్లో దోపిడీ - గుంటూరులో కలకలం
- అరెస్టు చేసిన పోలీసులు - ఆయుధం, సొత్తు స్వాధీనం





యువకుల దాడిలో మృతి చెందిన వాచ్‌మెన్‌లు శ్రీరామ్‌కృష్ణనిధి, శివయ్య మృతదేహాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

పూటుగా మద్యం సేవించి ఇనుప రాడ్డు తీసుకుని తెల్లవారుజామున ద్విచక్ర వాహనంతో రోడ్డెక్కిన ఇద్దరు యువకులు (మైనర్లు) గుంటూరులో భీతావాహం సృష్టించారు. పోలీసులపైనా దాడికి ప్రయత్నించారు. గతంలో కనీవినీ ఎరగని రీతిలో అమాయకులైన ఇద్దరు వాచ్‌మెన్‌లను హత్య చేసి షోరూమ్‌ల నుంచి భారీ దొంగతనానికి విఫలయత్నం చేశారు. గుంటూరు నగరంలో కలకలం రేపిన ఘటనలపై పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు మైనర్లు బైక్‌పై అమరావతి రోడ్డులోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న యమహా షోరూమ్ వద్దకు వెళ్లి షోరూంలో దోపిడీకి పాల్పడ్డారు. అప్పటికే నిద్రలో ఉన్న వాచ్‌మెన్ శ్రీరామ్ కృష్ణనిధిపై ఇనుపరాడ్ (పలుగు)తో దాడి చేసి హత్య చేశారు. షోరూమ్‌లోని ల్యాప్‌టాప్ ఇతర వస్తువులను చోరీ చేశారు. అరండల్‌పేట 11వ లైను మీ-సేవా కేంద్రంలో దోపిడీకి విఫలయత్నం చేశారు. అక్కడనుంచి అరండల్‌పేట 10వ లైనులో బీభత్సం సృష్టించారు. ప్రభుత్వ లిక్కర్ మార్టు (గిడ్డంగి)లో దోపిడీకి ప్రయత్నించారు. ఇక్కడ కాపాలగా ఉన్న బత్తుల సాంబశివరావు అలియాస్ కిరసనాయిల్ శివయ్యను రాడ్‌తో కొట్టి, కత్తితో ▶ 2లో



గ్యాస్ ధరల పెంపునకు వ్యతిరేకంగా ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారిపై సిపిఎం నిరసనలో మాట్లాడుతున్న ఆ పార్టీ సీనియర్ నాయకులు జొన్న శివశంకర్

బండపై మళ్లీ బాదుడు

- వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచిన కేంద్ర ప్రభుత్వం
- ఇంటికి చేరేసరికి రూ.1160 వసూలు?

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

వంట గ్యాస్ ధర బుధవారం మరోసారి పెరిగింది. ఈసారి కూడా సిలిండర్‌కు రూ.50ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. గతేడాది జులై మొదటి వారంలో గ్యాస్ ధర 14 కిలోల సిలిండర్‌కు రూ.50 చొప్పున పెంచారు. ప్రస్తుతం మార్కెట్‌లో సిలిండర్ ధర రూ.1075.50 పైసలు ఉండగా తాజా పెరుగుదలతో కలిపి రూ.1125.50 పైసలకు చేరింది. సిలిండర్ డెలివరీ ఛార్జీలు రూ.35 వరకు వసూలు చేస్తున్నారు. దీంతో సిలిండర్ ఇంటికి చేరేసరికి రూ.1160 చెల్లించాల్సి వస్తుందని ఏజెన్సీల నిర్వాహకులు తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల అదనపు వసూలుపై జిల్లా అధికారులు కూడా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. గ్యాస్ బిల్లులో సిలిండర్ ధర డోర్ డెలివరీతో కలిపి ఉన్నట్టు ఆయిల్ కంపెనీలు చెబుతున్నా రూ.30పైగా డోర్ డెలివరీ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వం విడతల వారీగా పెంచుతోంది. మరోవైపు వంట గ్యాస్‌పై సబ్సిడీ పూర్తిగా తొలగించారు. ప్రస్తుతం ఎంపిక చేసిన వినియోగదారులకు కేవలం ▶ 2లో



ఘటనా స్థలిలో గాయాలతో యశ్వంత్, రోడ్డుపై పడి మృతి చెందిన మణిదీప్‌కుమార్, ఇన్‌సెట్‌లో మృతుడు మణిదీప్‌కుమార్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి - చేబ్రోలు

రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థి దుర్మరణం పాలవగా, మరో విద్యార్థి తీవ్ర గాయాలపాలైన ఘటన మండలంలోని వడ్లమూడి క్వారీ, విజ్ఞాన్ యూనివర్సిటీ మధ్యలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పొన్నూరు పట్టణానికి చెందిన పుట్టా మణిదీప్‌కుమార్ (21) విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ (సిఎస్‌సి) మూడో సంవత్సరం చదువుతున్నాడు. మండలంలోని పచ్చలతాడిపర్రుకు చెందిన తన స్నేహితుడు వై.యశ్వంత్‌తో కలిసి బుధవారం ఉదయం ద్విచక్ర వాహనంపై కాలేజీకి వస్తున్నారు. వడ్లమూడి కొద్ది సేపట్లో కాలేజీకి వెళ్తారనగా తెనాలి వైపు ▶ 2లో



మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి రాస్తారోకో చేస్తున్న మృతుని కుటుంబీకులు, గ్రామస్తులు

విద్యార్థి మృతదేహంతో రాస్తారోకో

ప్రజాశక్తి - నకరికల్లు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మండల కేంద్రమైన నకరికల్లులో గ్రామస్తులు బుధవారం ఆందోళనకు దిగారు. స్థానిక వై జంక్షన్ వద్ద అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేశారు. వివరాల ప్రకారం.. కాలు వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో నకరికల్లు జెడ్‌పి పాఠశాల 9వ తరగతి విద్యార్థి మోర నాగార్జునరెడ్డి అనే విద్యార్థి మంగళవారం మృతి చెందాడు. దీంతో అతని మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి మృతుని కుటుంబీకులు, బంధువులు, విద్యార్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. రెండున్నర గంటల పాటు ఆందోళన కొనసాగడంతో ట్రాఫిక్ భారీగా ▶ 2లో

గ్యాస్ ధరల పెంపుపై నేడు నిరసనలు : సిపిఎం

ప్రజాశక్తి-గుంటూరు

వంటగ్యాస్ ధరల పెంపుదలను ఉపసంహరించుకోవాలని, ధరలను నియంత్రించాలని కోరుతూ అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో గురువారం నిరసనలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తాజాగా వంటగ్యాస్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 ధర పెంచిందని పేర్కొన్నారు. పెట్రోలు, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయని, ఈ సమయంలో ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం వంట గ్యాస్ ధరలను మరోసారి పెంచడం దారుణమని విమర్శించారు. మూడ్లే కిందట రూ.417 ఉన్న సిలిండర్ ధర నేడు రూ.1155 అయ్యిందని, గ్యాస్‌పై కేంద్రం ఇచ్చే సబ్సిడీని ఎత్తేశారని గుర్తు చేశారు. ధరల పెంపు పేద, మధ్యతరగతి ప్రజలకు తీవ్ర భారమని, ద్రవ్యోల్బణం పెరిగి ధరలు ఇంకా పెరిగే అవకాశం ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పోరేట్ సంస్థలకు రాయితీలిస్తూ, ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. చిరువ్యాపారులకు ఈ చర్య కొలుకోలేని దెబ్బ అని, ప్రభుత్వం వెంటనే పెంచిన వంట గ్యాస్ ధరలను ఉపసంహరించుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



ఆటోలో వెళ్తున్న గ్యాస్ సిలిండర్‌లు

బండపై మళ్లీ బాదుడు

(మొదటి పేజీ తరువాయి)

రూ.14 సబ్సిడీ ఖాతాల్లో జమవుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 14.60 లక్షల సబ్సిడీ కనెక్షన్లు ఉండగా వీటిల్లో కేవలం 5 వేలు మాత్రమే ప్రధాన మంత్రి ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఉజ్వల కనెక్షన్లుకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుందని మిగతా కనెక్షన్లుకు సబ్సిడీ లేదని అధికార వర్గాలు తెలిపాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి రాక ముందు సబ్సిడీ ద్వారా ప్రతి వినియోగదారుని ఖాతాల్లో రూ.280 నుంచి రూ.350 వరకు జమయ్యేది. యుపిఎ హయాంలో గ్యాస్ ధరలు పెరిగితే సబ్సిడీ కూడా పెరిగేది. ఈ సబ్సిడీని క్రమంగా తగ్గిస్తూ వచ్చిన బిజెపి ప్రభుత్వం ప్రజలపై భారం మోపుతోంది. దీంతో ఎంత ధర పెంచితే అంత మొత్తం పేద, బడుగు వర్గాలప్రజలు కూడా చెల్లించాల్సి వచ్చింది.

జిల్లాలో సగటున 40 రోజులు ఒక సిలిండర్ వినియోగించే వారి సంఖ్య 70 శాతం మంది ఉన్నారని, నెల రోజులకు సిలిండర్ వినియోగించే వారు 20 శాతం ఉన్నారని, 10 శాతం మంది 20 రోజులకే ఒక సిలిండర్ వినియోగిస్తారని ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. గతంలో గ్యాస్‌కు ప్రత్యామ్నాయంగా విద్యుత్ ఉపకరణాల ద్వారా వంటలు చేసుకునే వారు.

ఇప్పుడు విద్యుత్‌ఛార్జీల భారం కూడా పెరగడం వల్ల అటు గ్యాస్, ఇటు విద్యుత్ ధరలతో వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు. గ్యాస్ ధరల పెరుగుదల వల్ల జిల్లాలో నిత్యావసర వస్తువులు, తినుబండారాల ధరల పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే హోటళ్లు, చిన్న స్థాయి బండ్లవద్ద కూడా తినుబండారాల ధరలు గతేడాది కాలంలో విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం సాధారణ ప్రజలు కూడా రూ.30 వెచ్చిస్తే తప్ప రోడ్డు పక్కన అల్పాహారం దొరకని పరిస్థితి ఏర్పడింది. వాణిజ్య సిలిండర్ల ధరలుకూడా భారీగా పెంచడం వల్ల హోటళ్లలో టిఫిన్లు, ఇతర తినుబండారాల ధరలు భారీగా పెంచారు. గ్యాస్ ధరలు పెరుగుదల వల్ల అన్ని రకాల వస్తువుల ధరలు క్రమంగా పెరుగుతున్నాయి.

ఘనంగా అభయాంజనేయస్వామి తిరునాళ్ళ

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో గోగులపాడు గ్రామంలో వేంచేసియున్న సువర్చల సమేత శ్రీ అభయాంజనేయస్వామి తిరునాళ్ళ బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా, అందంగా అలంకరించి విశేష, సహస్రనామ, కుంకుమార్చన అలంకరణ పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామస్తులు, సందర్శకులు మహిళలు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్ళు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

సాయంత్రం వేళల్లో గ్రామంలో నుండి గుడి వద్దకు మొక్కుబడి ప్రభలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. తిరునాళ్ళ సందర్భంగా రాత్రి వేళల్లో గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు ఎస్ఐ సిహెచ్ సురేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

యువకుల ఘాతుకం


నిందితుల నుండి స్వాధీనం చేసుకున్న గడ్డ పలుగు, ఇతర వస్తువులను పరిశీలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్

(మొదటి పేజీ తరువాయి)

పొడిచి దారుణంగా హత్య చేశారు. తరువాత అరండల్‌పేట 10 లైనులో హైనెస్ అనే ఎలక్ట్రానిక్ దుకాణంపై దాడి చేశారు. కొన్ని వస్తువులు అపహరించారు. తరువాత స్వగృహ ఫుడ్స్‌పై దాడి చేశారు. వాచ్‌మెన్ ఏసుదాసుపై రాడ్‌తో దాడి చేయగా అతను ప్రతిఘటించాడు. తీవ్ర గాయాలతో అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లోకి పరుగెత్తి వారికి సమాచారం అందించారు. ఒక కానిస్టేబుల్ వాహనంలో అరండల్‌పేట 10వ లైను వద్ద వారిపై రాడ్ విసిరిన నిందితులు ద్విచక్ర వాహనంపై పారిపోయేందుకు ప్రయత్నించారు. పోలీసు వాహనం వెంబడిస్తున్న నేపథ్యంలో అరండల్‌పేట 4వ లైనులో శివాలయం వద్ద ట్రాఫిక్ నియంత్రణకు గడ్డర్లు అడ్డుగా ఉండటంతో పోలీసు వాహనం ముందుకు వెళ్లలేకపోయింది. ఈ లోగా నిందితులు ద్విచక్ర వాహనంపై పారిపోయారు. తరువాత అరండల్‌పేట మొదటి లైనులో మళ్లీ మద్యం సేవించారు. అక్కడ నుంచి పాత గుంటూరు వైపునకు వెళ్లి కొంతమందిపై దాడికి పాల్పడ్డారు. పాత గుంటూరు ప్రాంతంలో ఏసుబాబు అనే వ్యక్తిపై దాడి చేశారు. వేకువజామున దినపత్రికలు పంపిణీ చేసే పేపర్ బాయ్‌లపైనా దాడికి పాల్పడ్డారు. సుద్దపల్లి డొంక రోడ్డులో ఓ పాల బూత్ నిర్వాహకుడుపై తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఇనుప రాడ్‌తో దాడి చేయగా వీపు భాగానికి బలమైన దెబ్బలు తగిలింది. రెండో దెబ్బ వేస్తుండగా రాడ్డును పాల బూత్ నిర్వాహకుడు పట్టుకుని ప్రతిఘటించాడు. దీంతో వాళ్లు ఇద్దరు ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. హత్య జరిగిన ప్రదేశాలను గుంటూరు రేంజి ఐజి త్రివిక్రమ వర్మ, ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ పరిశీలించారు.

ఇద్దరు అరెస్టు : ఎస్‌పి

హత్యలను గంటల వ్యవధిలో ఛేదించి ఇద్దర్ని అరెస్టు చేశామని ఎస్‌పి ఆరీఫ్ హాఫీజ్ బుధవారం రాత్రి మీడియాకు వెల్లడించారు. గుంటూరుకు చెందిన మైనర్లు ఈ దాడులకు పాల్పడ్డట్టు తెలిపారు. డబ్బు కోసం వీరు ఇద్దర్ని హతమార్చి పలువురుపై దాడి చేశారని, నిందితుల్ని ప్రత్యేక బలగాలతో గాలించి పట్టుకున్నామని చెప్పారు. గతంలో వీరిపై షట్టర్లు పగలకొట్టిన కేసులున్నాయని, కొంతకాలం జువైనల్ హోంలో ఉండి వచ్చారని తెలిపారు. నిందితుల నుండి హత్యకు ఉపయోగించిన గడ్డ పలుగుతో పాటు హెల్మెట్ , చోరీ చేసిన సెల్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రాత్రి వేళ గస్తీ కొనసాగుతుందని, ప్రజలు భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ విద్యార్థి దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

నుండి నారాకోడూరు వైపు వెళ్తున్న వాహనం విద్యార్థులు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం పైనున్న ఇద్దరూ కింద పడిపోయారు. బైక్‌పై వెనక కూర్చున్న మణిదీప్‌కుమార్ ముఖ భాగంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా బైక్‌ను నడుపుతున్న యశ్వంత్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. క్షతగాత్రుడు యశ్వంత్‌ను డివిసి ఆస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి.వెంకటాద్రి తెలిపారు.

విద్యార్థి మృతదేహంతో రాస్తారోకో

(మొదటి పేజీ తరువాయి)

నిలిచింది. ఘటనా స్థలికి చేరుకున్న ఎస్ఐ సురేష్ ఆందోళనకారులతో మాట్లాడారు. మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పగా ఉన్నతాధికారుల నుండి హామీ కావాలని ఆందోళనకారులు కోరారు. దీంతో సత్తెనపల్లి రూరల్ సిఐ ఉమేష్ ఘటనా స్థలికి చేరుకుని హామీ ఇవ్వడంతో ఆందోళన ముగిసింది. అనంతరం డీఎస్పీ బి.ఆదినారాయణ నేతృత్వంలో రాజుపాలెం, ముప్పాళ్ల ఎస్ఐలు అమీర్, ఎ.బాలకృష్ణ తమ సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రబద్ధీకరించారు.

తప్పుడు ప్రచారాలపై అప్రమత్తం ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

సోషల్ మీడియా అసత్య వార్తలకు, తప్పుడు ప్రచారాలకు వేధికగా మారిందని వీటితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్థ సభ్యులు అన్నారు. బుధవారం స్థానిక బ్రాడీపేటలోని కుబేర ట్రవర్స్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో వక్తలు మాట్లాడుతూ ఈ రంగాన్ని అడ్డుపెట్టుకోని కొన్ని చోట్లు ప్రభుత్వాలను సైతం కూల్చివేసే విధంగా విష ప్రచారానికి కూడా బీజాలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇజ్రాయేల్‌కు చెందిన పెగాసస్ సాఫ్ట్‌వేర్ సాయంతో రాజకీయ నాయకులు, వాణిజ్య పాత్రికేయ రంగానికి చెందిన పలువురు ప్రముఖుల ఫోనులు ట్యాపరింగ్ జరింగదన్న విషయం ముగియక ముందే మరో వివాదం ఇప్పుడు ప్రపంచ దేశాలను కుదిపేస్తుందని తెలిపారు. ఇజ్రాయిల్ నుంచి టీమ్ జార్జి అనే సంస్థ 30కి పైగా దేశాల ఎన్నికల్లో జోక్యం చేసుకున్నట్లు వెలువడిన కథనాలు ఇప్పుడు సంబ్రమాశ్చర్యాలకు గురిచేస్తుందన్నారు. ఇలాంటి ప్రచారాలో వాస్తవాలను గ్రహించేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన సంస్త సభ్యులు కోరారు.

ఢిల్లీ ఉపముఖ్యమంత్రి అరెస్టు కక్ష సాధింపు చర్య

ప్రజాశక్తి- గుంటూరు

ఢిల్లీ ఉపముఖ్యమంత్రిచ మనీష్ సిసోడియాను అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్య అని అవగాహన సంస్థ సభ్యులు ఖండించారు. బుధవారం ఒక ప్రకట నలో వారు మాట్లాడుతూ ప్రతి పక్ష పార్టీలను ప్రత్యర్థులుగానూ, శత్రువులుగానూ చూసే సంస్కృతి గతంలో ఉన్నా అది ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం హాయంలో పరాకాష్టకు చేరిందని విమర్శించారు. అవినీతి వ్యతిరేక పోరాటంలో అన్నా హజారే, కెజ్రివాల్‌తో పాటు సిసోడియా ప్రముఖ పాత్ర వహించే వారని, నిజాయితీ పరుడైన పేరెందిన సిసోడియాను మద్యం కుంభకోణం పేరుతో అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్యేనని తీవ్రంగా ఖండించారు. డిల్లీ ప్రభుత్వం ప్రజలకు అనే విధాలుగా మేలు చేస్తూ వారి అభిమానం పొదుంతుందని మళ్లీ ఎన్నికల్లో గెలుస్తుందని దీన్ని సహించలేని కేంద్రం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఇటువంటి చర్యలను ప్రతిఘటించాలని అవగాహన సంస్థ సభ్యులు అన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత

ప్రతి గడపలో ప్రభుత్వ సంక్షేమమే..

ప్రజాశక్తి -ప్రత్తిపాడు

ప్రతి గడపలో ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందజేస్తుందని ఎమ్మెల్యే సుచరిత అన్నారు. బుధవారం మండలంలోని కొండెపాడు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అమె పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి తిరుగుతూ లబ్దిదారులకు అందిన సంక్షేమాల గురించి వివరించారు. రామినేని దుర్గ అమ్మఒడి, విద్యాదీవెన తప్ప తమకు ఏ సంక్షేమ పథకాలు రావడంలేదని , తమకు ఇంటి స్థలం కేటాయించాలని కోరింది.వాలంటీరులు ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్దిదారుల కార్డులను అందజేయండంలో అలసత్వం వహించడంతో ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్రా రాంబాబు, ఎంపిపి దాసరి అన్నమ్మ, జడ్‌పిటిసి రెడ్డి, ఎంపిడిఓ శ్రీరమ్య, కార్యదర్శి శ్వేత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సత్తెమ్మ తల్లి దేవాలయంలో కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి -అచ్చంపేట

మండలంలోని మాదిపాడు గ్రామ అటవీ ప్రాంతంలోని సత్యమ్మ తల్లి దేవాలయం వద్ద జరిగే అమ్మవారి కళ్యాణ మహెూత్సవానికి స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకర్రావు బుధవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు నంబూరు శంకర్రావుకు ఘనంగా స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనను దుశాలువాతో సత్కరించారు. అనంతరం అమ్మవారి కళ్యాణాన్ని నంబూరి తిలకించారు. దేవాలయ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన సందర్శకులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని ఆలయ నిర్వహకులకు , కమిటీ సభ్యులకు సూచించారు. అన్నదాన కార్యక్రమంలో సందర్శకులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం అచ్చంపేటలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన వెంట నెల్లూరు చంద్రబాబు, అంబటి నారాయణ, కంబాల వీరబాబు,ఎస్కే జానీ తదితరులు ఉన్నారు

పిల్లల శ్రేయస్సు కోరేది తల్లిదండ్రులే..!

11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి


మాట్లాడుతున్న జడ్జి జి. మాలతి

ప్రజాశక్తి-తెనాలి

పిల్లల శ్రేయస్సు కోరేవారిలో ప్రథములు తల్లిదండ్రులేనని, వారిని గౌరవించాలని 11వ అదనపు జిల్లా జడ్జి జి.మాలతి చెప్పారు. స్థానిక బోస్‌రోడ్డులోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో జడ్జి మాలతి మాట్లాడుతూ తల్లిదండ్రులు బిడ్డల ఉజ్వల భవిష్యత్‌పై ఎన్నో ఆశలు పెట్టుకుంటారని, దానికి అనుగుణంగా వారు ఎంతో శ్రమిస్తారన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ దాసరి, పలువురు అధ్యాపకులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు . కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఫించన్లు అందజేస్తున్న సురేష్ కుమార్,తదితరులు

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - తుళ్లూరు

పేదల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిస్తోందని తాడికొండ నియోజక వర్గ వైసిపి సమన్వయ కర్త కత్తెర సురేష్ కుమార్ అన్నారు.బుధవారం తుళ్లూరు మండలంలోని బోరుపాలెం,హరిశంద్ర పురం గ్రామాల్లో సంక్షేమ పథకాల అమలు గురించి సురేష్ కుమార్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద,బడుగు, బలహీన వర్గాల ఉద్ధరణ కోసం చేపట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సురేష్ కుమార్ కోరారు.కార్యక్రమంలో వైసిపి నాయకులు ఆలోకం సురేష్,కొప్పుల శేషగిరిరావు,తురకా శ్రీను,బండి ప్రసాద్,బెజ్జం రాంబాబు,జోజి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాల కోసం నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

ఉపాది అవకాశాలను పొందాలంటే కమ్యూనికేషన్ స్కిల్స్ అనివార్యమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాల్లో బుధవారం సీనియర్ ఇంటర్ విద్యార్థులకు జూనియర్ ఇంటర్ విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు సభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొలుత విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాంకేతికతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ ప్రపంచానికి దీటుగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. విద్యార్థిని జి.యమునకు నగదు బహుమతిని ఎమ్మెల్యే చేతులమీదుగా అందిచారు. కార్య క్రమంలో అధ్యాపకులు సురేష్ బాబు, విజయకృష్ణ, పార్వతి, బాబు, భేగం, నందకిషోర్ పాల్గొన్నారు.


విద్యార్థులతో ఎమ్మెల్యే శివకుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు



రైతును సత్కరిస్తున్న కంపెనీ బృందం, అధికారులకు వివరాలు తెలుపుతున్న రైతులు

అధిక ధర పలుకుతున్న యశ్వంత్-28 హైబ్రిడ్ మిరప

ప్రజాశక్తి-వినుకొండ: మిరపలో యశ్వంత్ -28 హైబ్రిడ్ మిరప అధిక ధర పలుకుంతుందని కంపెనీ రీజినల్ మేనేజర్ ద్వారకనాథ, రామకృష్ణ బృందం తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం రైతలను కలసి వివరాలు అడిగి వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా కొనకలమెట్ల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సురవరపు ఆదిరెడ్డి ఏడాది యశ్వంత్-28 రకం మిరప విత్తనం సాగు చేసి ఇప్పటికి రెండు కోతలు కోయగా ఎకరానికి 25 క్వింటాళ్ల మిరప దిగుబడి వచ్చింది. అలాగే వినుకొండ కేంద్రంగా ప్రకాశం జిల్లా పుల్లలచెరువు, త్రిపురాంతకం, కురిచేడు, కొనకలమిట్ల, తదితర మండలాల్లోని గ్రామాల్లో అధిక శాతం రైతులకు ఇవ్వటం జరిగిందన్నారు. సాగుచేసిన మిరప పంటలను మేము సందర్శించామన్నారు. పంట దిగుబడిలో తాలు శాతం తక్కువగా ఉందన్నారు. ఎర్ర నల్లి తామర పురుగు ప్రభావం ఉన్నప్పటికీ యస్వంత్-28 మిరప విత్తనం తట్టుకొని రైతుకు మంచి దిగుబడినిచ్చిందన్నారు. ప్రస్తుతం ఈ రకం మిరప మార్కెట్లో అధిక ధర సుమారు క్వింటాకు రూ. 23 వేలు పలుకు తుందన్నారు. మిరప సాగులో యశ్వంత్ 28 రకం విత్తనం తక్కువ పెట్టుబడి, మంచి రంగు, తాలు తక్కువతో మంచి దిగుబడి వచ్చి అధిక ఆదాయాన్ని తెచ్చి పెట్టడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ నెంబర్ -9666275447కు సంప్రదించాలని కోరారు.


చెక్కబల్ల బండ్లును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

చిరు వ్యాపారులకు చేయూత

ప్రజాశక్తి -దుగ్గిరాల : చిరు వ్యాపారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చెక్కబల్ల బండ్లను పంపిణీ చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తన సొంత నిధులతో మండలంలోని 30 మంది చిరు వ్యాపారస్తులకు బండ్లను అందజేశారని ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి,జెడ్పిటిసి మేకతోటి అరుణ లు తెలిపారు. సర్పంచ్ బాణావతి ఖుషి భాయ్ మాట్లాడుతూ పేదలతో పాటు అనారోగ్యం భారిన పడుతున్న వారికి కూడా ఎమ్మెల్యే ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యార్డు చైర్మన్ షేక్ బాజీ, పేరుకలపూడి సర్పంచ్ గంపల గంగాధర్,పెదపాలెం సర్పంచ్ పి.కృష్ణప్రసాద్, వీర్లపాలెం సర్పంచ్ ఏ. శ్రీనివాస రెడ్డి ,మంచికలపూడి సర్పంచ్ చిన్న బాణావత్ వెంకటేశ్వరనాయక్, గాలం పనింద్ర ,దానబోయిన వెంకటేశ్వరనాయక్ ,షేక్ నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



మిర్చి నిల్వలు

బ్యాగులు

మిర్చి దిగుమతి	:	1,10,959
మిర్చి ఎగుమతి	:	1,15,052
మిర్చి నిల్వ	:	86,584

మిర్చి ధరలు

రూపాయలలో

334	8500 - 22000
నెం.5	11000 - 21000
273	14500 -20000
341	9000 - 23000
4884	9500 - 19000
నాన్ ఏసి	
తేజ	8500 - 23000
బడిగి	11000 - 26000
దేవనూరు డీలక్స్	10500- 23000
తాలుకాయలు	5000 - 13000

ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో 200 చిత్ర ప్రదర్శనలు పూర్తి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్తానిక బోస్‌రోడ్డులోని పెమ్మసాని థియేటర్‌లో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సారధ్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఎన్టీఆర్ నటించిన కోడలు దిద్దిన కాపురం చిత్రాన్ని ఉచింతంగా ప్రదర్శించారు. ఉత్సవాల్లో ఇది 200వ ప్రదర్శనగా థియేటర్ కమిటీ తెలిపింది. తదుపరి పట్టణానికి చెందిన సాంఘిక నాటక కళాకారుడు కొర్రపాటి రవికిషోర్‌ను థియేటర్ కమిటీ సభ్యులు ఆర్.శివాజి, జి.కిరణ్, ఎం.ఫణిశ్రీ, కె.బసవయ్య, కుదరల్లి శ్రీనివాస్ సత్కరించారు. 200 చిత్రప్రదర్శనలు పూర్తయిన సందర్భంగా టీడిపి నాయకులు సోమవరపు నాగేశ్వరరావు కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో పెమ్మసాని పోతురాజు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఈదర వెంకటపూర్ణచంద్, ఇ.శ్రీనివాస్, డి.భవాని పాల్గొన్నారు.


రవికిషోర్‌ను సత్కరిస్తున్న థియేటర్ కమిటీ

పన్ను వసూళ్లపై నిరంతర పర్యవేక్షణ : డిపిఒ

ప్రజాశక్తి–ఈపూరు



నూరు శాతం పన్ను వసూళ్లే లక్ష్యంగా పంచాయతీలపై నిత్యం పర్యవేక్షిస్తున్నామని జిల్లా పంచాయతీ అధికారి విజయ భాస్కర్‌రెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి బుధవారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో రూ.27.95 కోట్లు ఇంటి పన్ను వసూలుకు గాను 50 శాతం వసూలు చేశామని, ఈపూరు మండలంలో రూ.75.25 లక్షలకుగాను 51.73 శాతం వసూలు చేశారని వివరించారు. 20వ తేదీ నాటికి నూరు శాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించామన్నారు. జిల్లాలో 409 ఎస్‌డబ్ల్యూ పిసి షెడ్లు ఉండగా వాటిలో 272 షెడ్లలో వర్మీకంపోస్టు తయారు చేస్తున్నారని తెలిరిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎ.ఉషాకిరణ్, ఇఒపిఆర్‌డి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతుల నుండి వినతులు స్వీకరిస్తున్న తహశీల్దార్

రైతులతో తహశీల్దార్ సమావేశం

ప్రజాశక్తి – అమరావతి

జగనన్న శాశ్వత భూహక్కు – భూరక్ష, సాదా బైనామ భూములపై మండలంలోని వైకుంఠపురంలో రైతులకు తహశీల్దార్ జె.విజయశ్రీ బుధవారం అవగాహన కల్పించారు. స్థానిక సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రైతుల నుండి రెండు అర్జీలు రాగా వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు. ఆర్ఐ ఎస్.రాజశేఖర్, వీఆర్వో వెంకటకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

బిజెపి విధానాలు, వైసిపి వైఫల్యాలపై విస్తృత ప్రచారం : కాంగ్రెస్

ప్రజాశక్తి – మాచర్ల

కేంద్రంలోని బిజెపి అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారాన్ని విస్తృతం చేస్తామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ వై.రామచంద్రారెడ్డి అన్నారు. రాయపూర్‌లో ఎఐసిసి 85వ ప్లీనరీ సమావేశానికి వెళ్లి వచ్చిన ఆయనకు స్థానిక వైసిపి నాయకులు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. దేశాన్ని కొద్ది మంది కార్పొరేట్లకు అప్పనంగా అప్పగించడమే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, విభజన హామీలు తదితర సాధనలో రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వ విఫలమైందని చెప్పారు. దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి కాంగ్రెస్ పార్టీ ఎంతో అవసరమని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. సమావేశంలో సత్యనారాయణ, ఆర్.ప్రతాప్, నాగరాజు, సిహెచ్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌పై అట్రాసిటీ కేసు పెట్టకుంటే ఉద్యమం

ప్రజాశక్తి – సత్తెనపల్లి రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న పెండ్యాల మహేష్

కొమెరపూడి విఆర్ఎ కె.శ్రీనివాసరావుపై దాడి చేసిన తహశీల్దార్ కె.నగేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఆయన్ను విధుల నుండి సస్పెండ్ చేయాలని విఆర్ఎల సంఘం మండలం గౌరవాధ్యక్షులు పి.మహేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సంఘం జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు షేక్ బందగీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. మహేష్ మాట్లాడుతూ కార్యాలయానికి విఆర్ఎను పిలిపించిన తహశీల్దార్ కనీసం విఆర్ఎ వివరణైనా వినకుండానే దాడి చేయడం అహంకారానికి నిదర్శనమని, పలు మండలాల్లోనూ ఇదే ధోరణి కనిపిస్తోందని అన్నారు. తాజా ఘటనపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుంటే అన్ని సంఘాలను ఐక్యం చేసి ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎం.హరిపోతురాజు, విఆర్ఎల సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజు, డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు పి.సంజీవరావు, కె.సుబ్బారావు, సత్తెనపల్లి, క్రోసూరు మండలాల అధ్యక్షులు టి.రవి, దినేష్, విఆర్ఎలు పాల్గొన్నారు.

కేసు ఎందుకు నమోదు చేయలేదు

ప్రజాశక్తి – సత్తెనపల్లి టౌన్

విఆర్ఎపై దాడి చేసిన తహశీల్దార్ కె.నగేష్‌పై పోలీసులు కేసు ఇంకా ఎందుకు నమోదు చేయలేదని పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రభాకర్ ఒకప్రకటనలో ప్రశ్నించారు. 50 వేల జనాభా భద్రత, హక్కులను కాపాడాల్సిన మండల మేజిస్ట్రేట్ హోదాలో ఉన్న తహశీల్దార్ నగేష్ తన హోదాను మరచి వ్యవహరించారని విమర్శించారు. బాధితులు ఫిర్యాదు చేసి నాలుగు రోజులవుతున్నా పోలీసులు విచారణ చేయకపోవడం అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు జిల్లా అధికారులుసైతం శాఖాపరమైన చర్యలు చెట్టకపోగా సంఘ నేతలను జిల్లా కేంద్రానికి పిలిపించుకొని ప్రలోభాలు, బెదిరింపులకు పాల్పడడం చట్టరీత్యా నేరమని, వీటన్నింటినీ కట్టిపెట్టి ఇకనైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బతికున్నా.. చనిపోయినట్లు..

ఆర్‌డిఒ ఎదుట ఈపూరు గ్రామ మహిళ ఆవేదన

ప్రజాశక్తి–ఈపూరు



ఆర్‌డిఒకు సమస్యలు చెబుతున్న మహిళ, స్థానికులు

ఏదైనా సమస్యతో సచివాలయానికి వస్తే పదేపదే తిప్పించుకుంటున్నారని, సరిగా పరిష్కరించడం లేదని ఆర్‌డిఒ శేషిరెడ్డి ఎదుట మండల కేంద్రమైన ఈపూరు గ్రామస్తులు వాపోయారు. భూ రీసర్వే పరిశీలన కోసం స్థానిక సచివాలయాన్ని ఆర్‌డిఒ బుధవారం సందర్శించగా గ్రామానికి పలువురు తమ సమస్యలను విన్నవించారు. వితంతు పింఛను కోసం రెండేళ్లుగా దరఖాస్తు చేసుకుంటున్నా సాంకేతిక కారణాలంటూ మంజూరు చేయడం లేదని ఓ మహిళ ఆవేదనకు గురవగా తాను బతికి ఉన్నా రేషన్ కార్డులో మాత్రం చనిపోయినట్లు చూపించారని, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించడం లేదని మరో మహిళ వాపోయారు. వీటిపై తహశీల్దార్ ఆర్.వెంకటేశ్వర్లు నాయక్‌తో మాట్లాడిన ఆర్‌డిఒ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం మండల సర్వేయర్ పి.చండిరాణితో మాట్లాడి భూసర్వేను వేగవంతం చేయాలని ఆదేశించారు.

అంత్యక్రియలకు వెళ్తుంటే పోలీసుల ఆంక్షలు

కుటుంబీకులు చనిపోయినా చూడనివ్వలేదని టిడిపి కార్యకర్తల ఆవేదన

ప్రజాశక్తి – మాచర్ల



వివరాలు చెబుతున్న కార్యకర్తలు

మరణించిన తమ కుటుంబ సభ్యులను కడసారి చూసేందుకు మాచర్ల రూరల్ సిఐ ఆధ్వర్యంలో పోలీసులు అంక్షలు విధించి, అడ్డుకున్నారని వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన జవిశెట్టి వెంకటేశ్వర్లు, తోట డిల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గుండ్లపాడులో ఉండే తమ కుటుంబ సభ్యుడు తోట కోటయ్య ఆనారోగ్యంతో మరణించగా తాము చూసేందుకు వెళ్తుంటే మాచర్ల రూరల్ సిఐ ఆధ్వర్యంలో పోలీసులు తమను అడ్డుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఒకరిద్దరు మాత్రమే వెళ్లాలంటూ రూరల్ సిఐ అంక్షలు విధించారని, తాము ఎంత బతిమాలినా వినలేదని అన్నారు. తమ ప్రత్యర్థుల వలన పొంచి ఉన్న ప్రాణహాని వలన తాము గ్రామం విడిచి మరోచోట జీవిస్తున్నామని, తాము గ్రామంలోకి ఒకరిద్దరు వెళితే ప్రత్యర్థులు తమపై దాడి చేస్తే ఎవరు కాపాడతారని ప్రశ్నించారు. తమ ప్రాణాలకు ఇప్పటికీ ప్రాణహాని ఉందన్నారు. వైసిపి కార్యకర్తల్లా పోలీసులు వ్యవహరించొద్దని కోరారు. సమావేశంలో జె.వెంకటరామయ్య, సందయ్య, సైదా, కొండలు, టి.ఆంజి పాల్గొన్నారు.

గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారని రాస్తారోకో

ప్రజాశక్తి – వినుకొండ



రాస్తారోకో చేస్తున్న టిడిపి శ్రేణులు, వారితో మాట్లాడుతున్న పోలీసులు

శావల్యాపురం మండలం గంటవారిపాలెంలో ఎన్‌టిఆర్ విగ్ర హాన్ని వైసిపికి చెందిన దుండగులు ధ్వంసం చేశారంటూ టిడిపి నాయకులు బుధవారం ఆందోళనకు దిగారు. విగ్రహానికి పాలాభిషేకం చేసిన అనంతరం గుంటూరు–కర్నూలు రహదారిపై బైటాయించారు. ఈ సందర్భంగా టిడిపి శావల్యాపురం మండల అధ్యక్షులు జి.సాంబశివరావు, జెడ్‌పిటిసి పి.హైమావతి, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ విగ్రహాలపై ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దాడులు చేయించడం హేయమైన చర్యన్నారు. వైసిపి ఫ్లెక్సీలు పెట్టుకోవడానికి విగ్రహం అడ్డుగా ఉందనే కారణంతో ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే ఆ పార్టీ శ్రేణులు విగ్రహ ధ్వంసం చేశారని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారని, పొట్లూరు, కారుమంచి తదితర గ్రామాల్లో ఇప్పటికే ఇలాంటి చర్యలకు పాల్పడి గొడవలు సృష్టించారని మండిపడ్డారు. విగ్రహం ధ్వంసానికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. రాస్తారోకో విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన విరమింపజేయగా ఎస్ఐకు టిడిపి నాయకులు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జి.విశ్వనాథం, జి.హనుమంతరావు, జి.వీరమస్తాన్‌రావు, బి.పేరయ్య, ఎస్.కృష్ణ, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వైసిపికి ఓటమి భయం : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి – నరసరావుపేట : ప్రజల మధ్య విద్వేషాలు రగిలిస్తూ వైసిపి ఎమ్మెల్యేలు, మంత్రులు పైశాచిక ఆనందం పొందుతున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గంటావారిపాలెంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని వైపిపికి చెందిన వారు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారని, టిడిపి అధికారంలో ఉండగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు అనుమతులు ఇచ్చిన సంగతి సిఎంతోపాటు వైసిపి నేతలు గుర్తించాలన్నారు. ఓటమి భయం పట్టుకున్న వైసిపి ఇలా మొండి ధైర్యాన్ని ప్రదర్శిస్తోందని, విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జి.జనార్దన్‌బాబు, కె.కిరణ్, ఆర్.జగ్గారావు పాల్గొన్నారు.

వీరమ్మ కాలనీలో సీజనల్ హాస్టల్ ప్రారంభం

ప్రజాశక్తి – రాజుపాలెం

విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమైన సీజనల్ హాస్టల్స్‌ను తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి బి.మల్లికార్జునశర్మ సూచించారు. మండలంలోని వీరమ్మ కాలనీలో దీనమ్మ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ నిర్వహణలో సీజనల్ హాస్టల్‌ను ఆయన బుధవారం ప్రారంభించి మాట్లాడారు. వివిధ పనులు నిమిత్తం వలసెళ్లే తల్లిదండ్రులు తమ పిల్లల్ని సీజనల్ హాస్టల్‌లో చేర్పిస్తే ఉచితంగా భోజనం, వసతి ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, దీనమ్మ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ చైర్మన్ జి.శంకర్రావు పాల్గొన్నారు.



హాస్టల్ ప్రారంభం అనంతరం విద్యార్థులతో ఎంఇఒ

గ్యాస్ ధర పెంచడం సిగ్గుచేటు

పెంచిన ధరను వెంటనే తగ్గించాలి - తాడేపల్లి, వడ్డేశ్వరంలో సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలపై అదరపు భారాలుగా పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎంటి ఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద సిపిఎం శ్రేణులు కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా శివ శంకర రావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేకసార్లు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై భారాలు వేసిందని అన్నారు. కృష్ణా, గోదావరి బేసిన్ లో ఉన్న గ్యాస్ నిక్షేపాలను తీసి కారు చౌకగా ప్రజలకు గ్యాస్ను అందించవచ్చని ఆయన అన్నారు. కానీ నరేంద్ర మోడీ ప్రైవేట్ శక్తులను పెంచి పోషించేందుకే ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీరం చేసి, ప్రజలపై అన్నపు బారాలు మోపుతున్నారని ఆయన విమర్శించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం విధానాలు వలన దేశవ్యాప్తంగా అన్ని రంగాలు కుదేలయ్యాయని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకటరెడ్డి అన్నారు. తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం కొలనుకొండ గ్రామ శాఖ కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, సిపిఎం సీనియర్ నాయకులు కాట్రగడ్డ శివరామకష్ణయ్య, సిపిఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, సిపిఎం నాయకులు గుంపెన వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రామారావు, ఎస్.కె గన్ తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిలో సిపిఎం నిరసన

ప్రజాశక్తి-తాడేపల్లి: కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకు తొమ్మిది సార్లు గ్యాస్ ధర పెంచారని ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు గాదె సుబ్బారెడ్డి విమర్శించారు. గ్యాస్ ధర పెంపు నిరసిస్తూ తాడేపల్లి బోసు బొమ్మ సెంటర్‌లో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం 14.2 కిలోల సిలిండర్ గ్యాస్ ధర రూ.1150 లకు చేరుకుందని చెప్పారు. డెలివరీ ఛార్జీలతో కలిసి రూ.1200 వసూలు చేసే అవకాశముందని అసంతృప్తి వ్యక్తం చేశారు. 19 కిలోల సిలిండర్ ధర రూ.350 పెంచారని వివరించారు. దీనివల్ల హోటళ్లు, రెస్టారెంట్లతో తినుబండారాల ధరలు పెరిగే అవకాశముందని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులు డి.శ్రీనివాసకుమారి, కె.కరుణాకరరావు, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి కన్వీనర్ గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, ఎస్.ముత్యాలరావు, కె.మేరి, వై.బర్నబస్, శేషయ్య, ఎంఎల్ నరసింహారావు, డి.దశరధరామిరెడ్డి, జి.సుంకన్న తదితరలు పాల్గొన్నారు.



వినుకొండలో సిపిఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

వినుకొండలో సిపిఐ నిరసన

ప్రజాశక్తి - వినుకొండ

గ్యాస్ ధరలనుపెంచడాన్ని నిరసిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలోని శివయ్య స్తూపం సెంటర్లో ధర్నా నిర్వహించారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సామానులపై భారం మోపుతారా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ కార్యకర్తలు నినాదాలు చేశారు. వెంటనే పెంచిన ధరలు తగ్గించాలని నినాదాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడారు. పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ. మారుతీ వరప్రసాద్, సిపిఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము తదితరులుపాల్గొన్నారు.



గుడారాల పండగకు బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గోరంట్లలో గురువారం నుంచి ఆదివారం వరకు హోసన్నా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గుడారాల పండగ సందర్భంగా వచ్చే ప్రజలకు తగిన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు జిల్లా ఎస్‌పి ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జరిగే మహాసభలకు భక్తులు రద్దీ ఎక్కువగా వుంటుందని అందుకు తగిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదనపు ఎస్‌పిలు శ్రీనివాసరావు, ఎఆర్ అదనపు కే. కోటేశ్వరరావు, డి యస్ పి. మెజేస్ పాల్, నల్లపాడు సిఐ బత్తుల శ్రీనివాస్ రావు స్పెషల్ బ్రాంచ్ సి ఐ నరసింహ రావు, హోసన్నా మినిస్ట్రీస్ నిర్వాహకులు బ్రదర్ అనిల్ పాల్గొన్నారు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిర అన్నారు. బుధవారం సాయంత్రం విద్యానగర్, కొమ్మినేని నగర్ లో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుండి సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని అక్కడిక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఒక్కో లబ్ధిదారునికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి, సిఎం పరిపాలన గురించి ఇంటింటికీ తిరిగి వివరించారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు, కార్యక్రమాల పట్ల ప్రజల్లో మరింత అవగాహన, చైతన్యం కల్పించే విధంగా ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. వైసిపి నాయకులు మందాల కోటిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, పోగర్తి రవీంద్ర, ఎర్రబోతుల వెంకటేశ్వర రెడ్డి, కస్పారెడ్డి, పలుసా రాజేష్, ఉదయ్ గారు, దానవాత్ వెంకటేశ్వర్లు నాయక్ , శ్రీను నాయక్ ,కేశవ రెడ్డి , దార ప్రేం కుమార్, శెట్టి అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మంగళగిరి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలను బుధవారం మంగళగిరి పట్టణంలో మున్సిపల్ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి, ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ ఎస్ చంగయ్య మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మికుల పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేసిందని విమర్శించారు. కార్మిక హక్కుల కొరకు జరిగే చలో ఢిల్లీ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ,26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు వై శివ నాగేశ్వరావు, కే ఏసు, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మంగళగిరిలో కరపత్రాల పంపిణీ


తాడేపల్లిలో కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి:

కార్పొరేట్లకు సేవ చేస్తూ రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలపై పెనుభారాలు మోపుడుతున్న కేంద్రలోని మోడీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిఐటియు పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. ఏప్రిల్ 5న చలో డిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయలని కోరుతూ బుధవారం తాడేపల్లి పట్టణంలోని ఎంఎల్ రామయ్య కాలనీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ ప్రజలు కొనుగోలు చేయలేని విధంగా గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను కేంద్ర ప్రభత్వం పెంచిందని విమర్శించారు. మరిన్ని భారాలు మోపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆందోళరన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలను నీరుగార్చి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, వి.వెంకన్న, కె.లక్ష్మి, ఎం.మల్లీశ్వరి, వై.ప్రసాద్, ఎస్‌కె షమీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తెనాలి

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5వ తేదీన జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీ నారాయణ కార్మికులకు పిలుపు నిచ్చారు. తెనాలి పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృ సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డ ద్వారనే సంక్షేమ పథకాలు అమలు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిర్మాణ దారుల నుండి వసూలు చేసే సెస్‌ను కంపల్సరీ కాదని చెప్పడంతో సంక్షేమ బోర్డుకి రావాల్సిన నిధులు రాకపోవడం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని అన్నారు. సంక్షేమ బోర్డు బలోపేతానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. పార్లమెంటు చట్టం ద్వారా వచ్చిన సంక్షేమ బోర్డును కాపాడుకోవడానికి జరిగే చలో ఢిల్లీ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ తెనాలి పట్టణ కార్యదర్శి హుసేన్ వలి, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఫరీక్ అహ్మద్, ఆర్ శ్రీనివాసరావు, కోశాధికారి జీ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.


తెనాలిలో కార్మికునికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

కార్మికునికి ఆర్థిక సహకారం

అనారోగ్యంతో బాధపడుతున్న పాండు రంగా అనే భావన నిర్మాణ కార్మికుడికి తెనాలి పట్టణ భవన నిర్మాణ తాపీ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో రూ. 6వేలు ఆర్థిక సహాయం, 12 రకాల నిత్యావసర సరుకులు నాయకులు అందజేశారు. సహకారం అందించిన తోటి భవన నిర్మాణ కార్మికులను ఈ సందర్భంగా దండా లక్ష్మీనారాయణ అభినందించారు. .

సెక్యూరిటీ గార్డుల కుటుంబాలను ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి-గుంటూరు : అగంతకుల దాడిలో మృతి చెందిన సెక్యూరిటీ గార్డులకు ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని సిఐటియు నగర తూర్పు, పశ్చిమ కమిటీల ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. అరండల్‌పేట 10వలైనులో ప్రభుత్వం నిర్వహిస్తున్న మదయం షాపు వద్ద విధులు నిర్వహిస్తున్న బత్తుల సాంబశివరావు, అమరావతి రోడ్డులోని యమహాషోరూం వద్ద పనిచేస్తున్న కృపానిధి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించి పరిహారం ఇవ్వాలని కోరారు. వైన్ షాపు వద్ద బుధవారం ఆందోళన చేస్తున్న సాంబశివరావు కుటుంబసభ్యులకు సిఐటియు నాయకులు సంఘీభావం తెలిపారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న వైన్ షాప్ సెక్యూరిటీ గార్డును హత్య చేయటం, స్వగృహ స్వీట్ షాపు లూటీ కోసం ప్రయత్నించటం వంటివి రాత్రివేళ గస్తి లేకపోవటం వల్లనే జరుగుతున్నాయన్నారు. కావున ప్రభుత్వం సెక్యూరిటీ గార్డుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. బాధితుల్ని పరామర్శించిన వారిలో సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నగర నాయకులు ఎ.నికల్సన్, భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి యస్.కె.ఖాసింవలి, అపార్ట్‌మెంట్స్ వాచ్‌మెన్స్ యూనియన్ నాయకులు వెంకట నరసయ్య, పాతగుంటూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి.శ్రీనివాసరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జి.పవన్ అధ్యక్షతన పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా పండగలు, సెలవు దినాల్లో పనిచేసే కార్మికులకు రావాల్సిన పెయిడ్ హాలిడేస్‌ను అనేకసార్లు విన్నవించి పోరాడిన సందర్భంగా సిఎండి, ఎస్ఈలు కార్మికులకు పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని ఆదేశించినా ఇంతవరకూ జమ కాలేదన్నారు. కొంత మంది కాంట్రాక్టర్లు ఈపిఎఫ్ కట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఇపిఎఫ్ చెల్లించే విధంగా విద్యుత్ పర్యవేక్షించాలని కోరారు. విద్యుత్ బిల్లు రద్దుతోపాటు, ఇతర డిమాండ్స్‌తో ఏప్రిల్ 5న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జి.నాగరాజు మాట్లాడుతూ సంస్థ రక్షణ కోసం జరిగే పోరాటంలో కాంట్రాక్ట్ కార్మికులు కూడా పెద్ద ఎత్తున భాగ స్వామ్యం కావాలని, ఉద్యోగ భద్రత, విద్యుత్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో భాషా, రాజు పాల్గొన్నారు.



వెలగపూడిలో రైతుల ఆందోళన

అమరావతి ఉద్యమం ఆగదు

ప్రజాశక్తి - తుళ్లూరు

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానని ప్రకటించే వరకు ఉద్యమం ఆగదని రైతులు స్పష్టం చేశారు.తుళ్లూరు, నెక్కలు,అనంతవరం, వెలగపూడి, మందడం, వెంకటపాలెం తదితర గ్రామాల్లో రైతులు, మహిళలు చేస్తున్న దీక్షలు బుధవారంతో 1170వ రోజుకు చేరాయి.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించారు.

6-11 తేదీల్లో నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెదకూరపాడు

నాగార్జున సాగర్ కుడికాల్వకు నీటి సరఫరాలో 6వ తేదీ నుంచి వారాబందీని అమలు చేస్తున్నట్లు ఇరిగేషన్ ఎఇ చిరంజీవిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తేదీ నుండి 11వ తేదీ వరకూ కాల్వలకు నీటి సరఫరా ఉండదని, 12వ తేదీ నుండి 20వ తేదీ వరకూ విడుదల చేస్తామని పేర్కొన్నారు.



పెద అంకాళ్లుకు నివాళులర్పిస్తున్న నాయకులు

మాజీ సర్పంచ్ పెద అంకాళ్లు మృతి

ప్రజాశక్తి - బెల్లంకొండ

కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రాజుపాలెం మాజీ సర్పంచ్, టిడిపి సీనియర్ నాయకులు టి.పెదఅంకాళ్లు బుధవారం మృతి చెందారు. ఆయన మృతికి మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సంతాపం తెలిపారు. పెద అంకాల్లు కుటుంబీకులతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. భౌతికకాయాన్ని గుంటూరు మిర్చియార్డు మాజీ ఛైర్మన్ వెన్న సాంబశివరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి మండల అధ్యక్షులు ఎన్.లక్ష్మీనారాయణ, నాయకులు ఒ.ఆనంద్, గంగారావు, టి.రామకృష్ణ, ఒ.రాంబాబు, టి.వెంకయ్య, జి.ఏడుకొండలు ఎం.కొండలు తదితరులున్నారు.



సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డిఎల్‌పిఒ

నూజెండ్లలో డిఎల్‌పిఒ పరిశీలన

ప్రజాశక్తి - నూజెండ్ల

మండల కేంద్రమైన నూజెండ్లలోని సచివాలయాన్ని డిఎల్‌పిఒ ఎం.వెంకటరెడ్డి బుధవారం సందర్శించారు. సిబ్బంది పని, పథకాల అమలుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ షేక్ జిలాని బాష, పంచాయతీ కార్యదర్శి రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

హద్దురాళ్ల పరిశీలన

ప్రజాశక్తి - నాదెండ్ల

భూ రీ సర్వేలో భాగంగా చందవరం, బుక్కాపురం గ్రామాల్లోని పొలాల వద్ద హద్దు రాళ్లు వేయడాన్ని తహశీల్దార్ ఎవి రమణ బుధవారం పరిశీలించారు. ఈ విషయంపై రైతులతో చర్చించారు. అనంతరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు.



బీసీలు లక్ష్యంగా వైసిపి దాడులు : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట




విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

వైసిపి పాలనలో ప్రజలపై దాడులతోపాటు బీసీలను ప్రత్యేకంగా టార్గెట్ చేసిందని, తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్‌పై దాడి ఇందుకు తాజా ఉదాహరణని టిడిపి బిసి సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షులు ఎం.రాంబాబు మండిపడ్డారు. ఈ మేరకు స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కార్యకర్తలు తమ ఇళ్లల్లో శుభకార్యాల సందర్భంగా ఫ్లెక్సీలు వేస్తుంటే వాటిని వైసిపికి చెందిన వారు చింపేస్తున్నారని, కారంపూడి మండలం మిరియాల గ్రామంలో బత్తుల ఆవులయ్యా కుటుంబంలో ఫంక్షన్‌కు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిని ట్రాక్టర్‌పై తీసుకెళ్లినందుకు ఆ ట్రాక్టర్‌ను తగలబెట్టారని అన్నారు. నరసరావుపేట పార్లమెంట్ టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గోరంట్ల నాగేశ్వరావుపై కారంపూడిలో పట్టపగలే రాడ్లతో దాడి చేశారని, నరసరావుపేట మండలం కేసనపల్లిలో టిడిపి కార్యకర్తలపై దాడి చేశారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి బీసీలు బుద్ధి చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకులు ఒ.ఆనంద్, టి.నరసింహారావు, పి.బసవేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టైలర్ బిడ్డల చదువుకు సాయం

ప్రజాశక్తి - చిలకలూరిపేట



టైలర్లకు సాయం అందిస్తున్న జాన్‌సైదా

టైలర్ల కుటుంబాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులుంటే వారి ఉన్నత చదువులకు తాము తోడ్పాటునిస్తామని జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జాన్‌సైదా చెప్పారు. టైలర్స్ డే సందర్భంగా స్థానిక సాల్ బుడే షాదీఖానాలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టైలర్లు ఎన్నో కష్టనష్టాల కోర్చి జీవనం సాగిస్తున్నారని, వారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. నాదెండ్ల మాజీ ఎంపిపి కె.వీరారెడ్డి మాట్లాడుతూ టైలర్ల పని సమాజ సేవతో సమానమన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధ పడుతున్న ఏడుగురు టైలర్లకు రూ.2 వేల చొప్పున సాయం అందించారు. కార్యక్రమంలో వైసిసి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ నాయుడు వాసు, షేక్ అబ్దుల్ రవూఫ్, 15వ వార్డు కౌన్సిలర్ జె.సుబ్బారావు, బివి రెడ్డి, కె.విజయభాస్కర్‌రెడ్డి, షేక్ కరిముల్లా, జె.ఆదిబాబు, ఎం.శేషిరెడ్డి పాల్గొన్నారు.

'డేటాను వైసిపికి అమ్ముకుని విమర్శలా?'

ప్రజాశక్తి - అచ్చంపేట



విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని టిడిపి నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మండల కేంద్రమైన అచ్చంపేటలోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద బుధవారం విలేకర్లతో మాట్లాడారు. టిడిపికి ద్రోహం చేసిన వెంకట శివ తన భూములను కాపాడుకోవడం కోసం వైసిపిలోకి వెళ్లారని, ఆయన తప్పులను కప్పి పుచ్చుకోవడానికి మాజీ ఎమ్మెల్యే శ్రీధర్, టిడిపి జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులుపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల బూత్ బాధ్యతలు చూసిన ఆయన ఆ డేటాను వైసిపికి అమ్ముకున్నారని ఆరోపించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు ఎన్.ఆశీర్వాదం, మాజీ జెడ్‌పిటిసి ఎన్.వెంకటేశ్వర్లు, నాయకులు టి.సుబ్బారావు, ఆర్.థామస్, బి.సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మల పాఠశాలలో ల్యాబ్, లైబ్రెరీ ప్రారంభం

ప్రజాశక్తి - వినుకొండ



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

పట్టణంలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో నూతనమైన భౌతిక, రసాయన, కంప్యూటర్, జీవశాస్త్ర ప్రయోగశాలను, గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా వైజ్ఞానిక కో-ఆర్డినేటర్ మధు, బొగ్గరం జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం వీరప్పయ్య, 19వ వార్డు కౌన్సిలర్ ఎస్‌కె బాస బుధవారం ప్రారంభించారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్స్ సిస్టర్ డెన్నీస్, సుపీరియర్ సిస్టర్ క్యాస్పర్, ప్రిన్సిపాల్ సిస్టర్ రాణి గోవింద్ పాల్గొన్నారు.



డబ్బు, మద్యం పంచకుండా జగన్ పోటీ చేయాలి : కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యం ఉంటే ఎన్నికల్లో డబ్బు, మద్యం పంచకుండా పోటీ చేయాలని టిడిపి నేత కన్నా లక్ష్మీనారాయణ సవాలు విసిరారు. అచ్చంపేటలోని ఓ ఆలయానికి బుధవారం వెళ్తున్న కన్నా మార్గం మధ్యలో సత్తెనపల్లి పట్టణంలోని 22వ వార్డుకు చెందిన టిడిపి కార్యకర్త మల్లాల నర్సయ్య ఇంట్లో అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 175 సీట్లు గెలుస్తామని అనుకుంటే ప్రతిపక్షాల గొంతు ఎందుకు నొక్కుతున్నారని ప్రశ్నించారు. టిడిపి నాయకులు, కార్యకర్తల ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, అట్రాసిటీ కేసులు పెడుతున్నారని, ఇవన్నీ ఎందుకుని అన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి లాగా పరిపాలిస్తున్నాని అనుకుంటే ప్రజల వద్దకు వెళ్లి ఓటు అడగాలని అన్నారు.

గామాలపాడులో జెకె ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - దాచేపల్లి

మండలంలో గామాలపాడు పంజాబీ దాబా వద్ద పిడుగురాళ్ల జెడ్‌పిటిసి జంగా వెంకట కోటయ్యకు చెందిన జెకె ఫిల్లింగ్ స్టేషన్ (పెట్రోల్ బంకు)ను విజ్ఞాన్ విద్యా సంస్థ అధినేత లావు రత్తయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత తనకు రాజకీయాల్లో ఎన్నో ఏళ్ల అనుభవం ఉందని, రాజకీయ చరిత్రలో కల్మషం లేని వ్యక్తి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అని అన్నారు. డబ్బు, పదవి శాశ్వతం కాదని, అవి ఉన్నా లేకున్నా ఎప్పుడు ఒకేలా ఉండే వ్యక్తి జంగా అని చెప్పారు. వారి కుమారులు నిర్వహించే ఈ ఫిల్లింగ్ స్టేషన్ పది మందికి ఉపాధి కల్పించి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాచేపల్లి మున్సిపల్ ఛైర్మన్ కె.సుబ్బమ్మ సాంబయ్య, వడ్డెర కార్పొరేషన్ ఛైర్మన్ డి.రేవతి, నడికుడి మాజీ సర్పంచ్ విజయకుమార్‌రెడ్డి, గురజాల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కె.ఆంధ్రయ్య, వైస్ ఎంపిపి కె.జాను, జె.సైదులు, సిహెచ్.శేషయ్య, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయులు రామారావు మృతి



ప్రజాశక్తి - అమరావతి : మండల కేంద్రమైన అమరావతికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు బచ్చు రామారావు (87) బుధవారం మృతి చెందారు. స్థానిక శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ లో 30 ఏళ్లపాటు హింది ఉపాధ్యాయునిగా పనిచేసిన ఆయన మృతి పట్ల వైసిపి సీనియర్ నాయకులు ఎన్.విజయసాగర్‌బాబు, సర్పంచ్ పి.రాజేశ్వరి, ఎం.శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు వి.సుబ్బారావు, కె.లక్ష్మీనారాయణ సంతాపం తెలిపారు.

ఆస్పత్రిలో ఉన్న వికలాంగురాలికి పింఛను



ప్రజాశక్తి - రొంపిచర్ల : మండలంలో మాచవరానికి చెందిన వికలాంగురాలు నాగినీడి సైదమ్మ కొద్ది రోజులుగా గుంటూరులో ఒక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఇది తెలియని వాలంటీర్ వి.రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఉదయం ఆమె ఇంటికి వెళ్లగా ఆస్పత్రిలో ఉన్నట్లు తెలిసింది. వెంటనే గుంటూరుకు వచ్చి ఆసత్రిలో ఉన్న సైదమ్మకు పింఛను ఇచ్చి వెళ్లారు.

9న యడ్లపాడు మండల పరిషత్ సమావేశం

ప్రజాశక్తి - యడ్లపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం 9వ తేదీన నిర్వహిస్తామని ఎంపిడిఒ వై.హనుమరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపిపి పి.ఝాన్సీ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష, ఇతర అంశాలపై చర్చ ఉంటుందని, సభ్యులంతా సకాలంలో హాజరవ్వాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

పేదలందరికీ ఇళ్ళ పథకం లేఅవుట్‌లలో ఇళ్ళ నిర్మాణాలకు ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించేందుకు ప్రత్యేక అధికారులు, హౌసింగ్, ఎంపీడీవో, తహశీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణు గోపాల్ రెడ్డి ఆదేశించారు. బుధవారం తాడేపల్లిలోని ఎంటీఎంసీ మున్సిపల్ అదనపు కమీషనర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ ఎం. వేణు గోపాల్ రెడ్డి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, గుంటూరు కలెక్టరేట్ వీసీ సమావేశమందిరం నుంచి జెసి రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై, ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, యంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి పేదలందరికీ ఇళ్ళ పథకంలో ఉగాది నాటికి నిర్దేశించిన ఇళ్ళను ఖచ్చితంగా పూర్తి చేసేలా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులను ఇళ్ళ నిర్మాణాలలో భాగస్వామ్యం చేసి నిర్మాణ పనులు వేగవంతం చేసుకునేలా లబ్ధదారులకు అవగాహన కల్పించాలన్నారు. లేఅవుట్‌లలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు మార్చి 10 నాటికి ఖచ్చితంగా పూర్తి అయ్యేలా పంచాయితీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన పనులను వచ్చే శనివారం నాటికి నూరు శాతం గ్రౌండింగ్ చేయాలని, పూర్తి అయిన పనుల బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న స్మశాన వాటిక వివరాలను అందించాలని, స్మశనవాటికలు లేని గ్రామాలకు స్థలాలకు ప్రతిపాదనలు అందించి వెంటనే భూసేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సంయుక్త కలెక్టర్ జి. రాజ కుమారి మాట్లాడుతూ ఎఫ్‌పీఓఎల్‌ఆర్‌లో మ్యూటేషన్ ధరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని, సాదాబైనామ ధరఖాస్తులను పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎఫ్‌పీఓఎల్‌ఆర్ ధరఖాస్తుల పరిష్కారంలో అశించినస్థాయిలో పనితీరు కనపర్చని ప్రతి మండలం నుంచి వీఆర్వోను, సర్వేయర్‌ను ప్రతి సోమవారం సాయంత్రం సంయుక్త కలెక్టర్ చాంబర్‌కు కారణాలతో స్వయంగా హాజరు కావాలన్నారు. ఒన్ టైం కన్వర్షన్ దరఖాస్తులను ప్రతి వారం నిర్దేశించిన లక్ష్యాల మేరకు పరిష్కరించేలా సబ్ కలెక్టర్, ఆర్డీవో తహశీల్దార్లతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటరామి రెడ్డి హౌసింగ్ పీడీ సాయినాథ కుమార్, పంచాయితీరాజ్ ఎస్ ఈ బ్రహ్మయ్య,పాల్గొన్నారు.

ఎసిడిపిఒగా సుచిత్రకు ప్రమోషన్

ప్రజాశక్తి-తెనాలి

ఐసిడిఎస్ తెనాలి ప్రాజెక్టు పరిధిలో సెక్టార్-1 సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఎం.సుచిత్ర అడిషినల్ సిడిపిఒగా పదోన్నతి పొందినట్లు బుధవారం ఆమె తెలిపారు. ఆమె బాపట్ల జిల్లా వేటపాలెం ప్రాజెక్టులో ఏసిడిపివోగా బాధ్యతలు స్వీకరించారు. అలాగే తెనాలి ప్రాజెక్టులో అడిషినల్ సిడిపివోగా పనిచేస్తున్న విజయశ్రీని డైరెక్టరేట్‌కు బదిలి చేశారు. ఆమె కూడా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సుచిత్ర 2013లో ఏపిపిఎస్సీ ద్వారా గ్రేడ్-1 సూపర్‌వైజర్‌గా ఎంపికై తొలుత అమృతలూరు, తెనాలి ప్రాజెక్టుల్లో పనిచేశారు. పదోన్నతి పొందిన సుచిత్రను సిడిపిఓ గీతాంజలితో పాటు పలువురు అంగన్‌వాడీలు, సిబ్బంది అభినందించారు.

భారత్ బచావో జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తెనాలి

ఈనెల 5న గుంటూరు కొత్తపేటలోని విజయా టాకీస్ పక్కనున్న సిపిఐ కార్యాలంలో నిర్వహించే భారత్ బచావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఆర్ శివకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక రామలింగేశ్వరపేటలోని ప్రజాఉద్యమాల పరిశోధన కార్యాలయంలో బుధవారం భారత్ బచావో గోపత్రికను ఆవిష్కరించారు. ఈ సంద్భంగా శివకృష్ణ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, భజరంగధల్, సంఘ్ పరివార్ శక్తులు దేశంలో మతతత్వాన్ని, విద్వేషాలను రెచ్చగొడుతున్నాయన్నారు. దార్శనికుడు, ప్రపంచ మేథావి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సైతం విస్మరిస్తూ వికృతపోకడలు పోతున్నారన్నారు. ఈపరిణామాలను తిప్పికొట్టేందుకు నిర్వహిస్తున్న భారత్ భచావో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత షెడ్యూల్డ్ కూలాల హక్కుల పరిరక్షణ సంఘం సెక్రటరీ అందే శ్యామ్, ఏఐఎస్‌సిఆర్‌పిఎస్ రాష్ట్ర సెక్రటరీ దాసరి వెంకటేశ్వరరావు, కె.వినోద్, పి.శాయి, శ్రీనివాస్ రాజేష్, సురేఫ్, క్రాంతి, మహేష్ పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-తెనాలి

సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లో చదువుతున్న ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కొరకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్‌లో సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బుద్ధిమాంద్యం, వినికిడి లోపం, దృష్టిలోపం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన వీల్ చైర్స్, ట్రైసైకిల్స్, రొటేటర్స్, ఎంఆర్ కిట్స్, బ్రెయిలీ కిట్లు ఉచితంగా అందిస్తామన్నారు. భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపిస్ట్‌లు అందుబాటులో ఉండి, వారికి స్పీచ్ థెరపీ, స్పీచ్ థెరపీ సేవలు అందిస్తున్నారన్నారు. విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్స్, హెచ్‌బిఎ, రీటర్ అలవెన్సులు, బాలికల స్టైఫండ్ అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లా సమన్వయకర్త ఎన్.శ్రీనివాసరావు, మండల విద్యాధికారి మేకల లక్ష్మీనారాయణ, ఆప్తమాలజిస్ట్, ఫిజియోథెరపిస్ట్‌లు, ఆడియాల జిస్టులు, స్పీచ్ తెరపిస్టులు పాల్గొన్నారు. మొత్తం 102 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిం చినట్లు అధికారులు తెలిపారు.


నివాళులర్పిస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెట్టి ఆమోదించాలని ఎంఈ ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇందుపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం మంగళగిరి జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జరిగిన సంస్మరణ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. 2008లో గాంధీ భవనం వద్ద జరిగిన ఘటనల్లో అమరులైన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలకు నివాళులర్పించారు. బిజెపి నాయకులు ఎస్సీ వర్గీకరణకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కే.నాగేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ కమ్యూనిటీ భవనం ప్రారంభం


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లిలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ కమ్యూనిటీ భవనాన్ని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి మంగళవారం రాత్రి ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ కుంచనపల్లిలో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాలతో రూ.1.50 కోట్ల నిధులతో అంబేద్కర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ ను నిర్మించారని తెలిపారు. రానున్న కాలంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా మంగళగిరి నియోజకవర్గాన్ని అబివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వైసిపి తాడేపల్లి మండల నాయకులు ఈదులమూడి డేవిడ్ రాజు, పట్టణ కార్యదర్శి బి.వేణుగోపాల స్వామి రెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షులు ఎం. వివేకానంద రెడ్డి, కుంచనపల్లి గ్రామ నాయకులు ఎం.రాంబాబు, అమరా నాగయ్య, చాగంటి వెంకటరెడ్డి, డి.తిరుమలరెడ్డి,కె.సాంబిరెడ్డి, కె. ప్రతాపరెడ్డి, బి విజయేందర్ రావు, ఇప్పటం సొసైటీ అధ్యక్షులు కె. శివ నాగేశ్వరరావు, ఎన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్, తదితరులు

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి

గత నెల తాడేపల్లి ఎన్‌టిఆర్ కట్ట మీద ధనుంజయ రాజు (కుక్కల రాజు) చేతిలో హత్యకు గురైన ఎస్తేర్‌రాణి కుటంబానికి ప్రభుత్వం తరుపున అందించే రూ.10 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎస్తేర్‌రాణి కుటుంబాన్ని అన్ని విధాలా అదుకుంటామని హామీ ఇచ్చారు. కృష్ణాజిల్లాలో ఇంటి స్థలం కూడా కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి మురుగుడు హనుమంతరావు, తహశీల్దార్ నాగిరెడ్డి, మహిళా సంఘం నాయకులు డి.శ్రీనివాసకుమారి, వైసిపి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్త పరీక్ష కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో టిడిపి ఆధ్వర్యంలో నడుస్తున్న సంజీవని ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్త పరీక్షా కేంద్రాన్ని డాక్టర్ చల్లగుండ్ల శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిలో ఉచితంగా ప్రజలు వైద్య సేవలు పొందడానికి సంజీవని ఆరోగ్య కేంద్రం నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రారంభించడం మంచి పరిణామమని అభినందించారు. షుగర్, కిడ్నీ, లివర్, కొలెస్ట్రాల్, హిమోగ్లోబిన్, థైరాయిడ్ తదితర రక్త పరీక్షలన్నీ ఉచితంగా చేసి , మందలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, దాసు, డి.సుందరారవుయాదవ్, ఒ.రాము, ఇ.పెంచలయ్య, భాస్కర్, మురళీ, గోపాలరావు, కె.శివప్రసాద్, ఊర్మిళ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్య ఆళ్ల రామకృష్ణారెడ్డి

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరంలో పలు అభివృద్ధి పనులను మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలోని రూ.25 లక్షలతో తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులనూ, రూ.50 లక్షలలతో నిర్మాణం అవుతున్న సిసి రోడ్లనూ, ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణ పనులనూ ఆయన పరిశీలించారు. అదేవిధంగా ముస్లిం స్మశాన వాటికలో జరుగుతున్న పనులను పరిశీలించి, అంతర్గత రోడ్లు, విద్యుత్తు స్తంభాలు, లైట్లు, ప్రహరీ, స్మశాన వాటికలో షెడ్డు నిర్మాణం త్వరతిగతిన పూర్తి చేయాలని అధికారులకుసూచనలను చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వైసిపి గ్రామ నాయకులు గొడవర్తి శ్రీనివాసరావు, కె. మల్లికార్జున రావు,తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యారోగ్య శాఖలో ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-గుంటూరు

వైద్య ఆరోగ్యశాఖలో వివిధ రకాల పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.శ్రవణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్యాధికారులు 37, స్టాఫ్ నర్సులు 70 పోస్టులు, ఇతర పారామెడికల్ సిబ్బంది 23 పోస్టులు కలిపి మొత్తం 130 ఉద్యోగాల నియామకం చేస్తున్నట్లు చెప్పారు. ఈ నియామకాలు జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా అర్హులైన అభ్యర్థులతో, రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తామని, ఎవరి సిఫార్సులూ పరిగణనలోకి తీసుకోబడవు అని, డబ్బు ప్రలోభాలకు తావు లేదని తెలిపారు. కావున అభ్యర్థులు దళారులను, మధ్యవర్తుల్ని నమ్మి మోసపోవద్దని కోరారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ అధ్యాపకురాలికి పీహెచ్‌డీ

ప్రజాశక్తి-గుంటూరు



వడ్లమూడి, యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్విని వల్లూరికి తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించినట్లు వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ' లోపవర్, ఏరియా ఎఫిసియంట్ అండ్ రిలియబుల్ సీఎన్‌టీఎఫ్‌ఈటీ (కార్బన్ నానో ట్యూబ్ ఫీల్డ్ ఎఫెక్ట్ ట్రాన్సిస్టర్) బేస్డ్ ఎస్‌ఆర్‌ఏఎమ్ (స్టాటిక్ రాండమ్ యాక్సిస్ మెమోరీ) డిజైన్ ఫర్ ఏ పేస్‌మేకర్ డివైస్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారని వీసీ అన్నారు. అశ్వినికి యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శారద గైడ్‌గా వ్యవహరించారన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అశ్వినిని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

కర్రసాములో హర్షితకు బంగారు పతకం

ప్రజాశక్తి-గుంటూరు



హర్షితను అభినందిస్తున్న భరత్‌రెడ్డి తదితరులు

నేషనల్ యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ ఫెడరేషన్ నిర్వహించిన 11వ నేషనల్ యూత్ గేమ్స్ చాంపియన్‌షిప్ కర్రసాము (సిలంబం) పోటీల్లో స్టెమ్ స్కూల్ విద్యార్థిని ఆళ్ల హర్షితరెడ్డి ప్రధమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా హర్షితరెడ్డిని పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ ఫాదర్ భరత్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ దిలీప్‌కుమార్ విద్యార్థిని అభినందించారు. ఫాదర్ భరత్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాయామ క్రీడలతోపాటు, ఆత్మరక్షణకు కర్రసాము వంటి విద్యలను సాధన చేయటం ఎంతో మంచిదన్నారు. కోచ్ కాశీ విశ్వనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు హర్షితరెడ్డిని అభినందించారు.

పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ నుండి

జయనాగశ్రీకి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - మంగళగిరి



పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీలో మంగళగిరికి చెందిన ఆకురాతి జయ నాగశ్రీ అనే విద్యార్థిని 2018- 20 విద్యా సంవత్సరంలో ఎంఎస్సీ స్టాటిస్టిక్స్ పూర్తి చేసి, స్టాటిస్టిక్స్ విభాగంలో గోల్డ్ మెడల్ అందుకుంది. యూనివర్సిటీలో మంగళవారం రాత్రి జరిగిన కాన్వకేషన్‌లో పాండిచ్చేరి ప్రభుత్వ జిక్మార్ హాస్పిటల్ డైరెక్టర్ ఆకాష్ కుమార్ చేతుల మీదగా జయనాగశ్రీ గోల్డ్ మెడల్ అందుకుంది. ప్రస్తుతం విద్యార్థిని జయనాగశ్రీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో స్టాటిస్టిక్స్ పై పీహెచ్డి చేస్తుంది. జయనాగశ్రీ తండ్రి ఆకురాతి వాసుదేవ మహేశ్వరరావు మంగళగిరి ఏపీఎస్పీ రోడ్డులో అనువంశిక మూలికా వైద్యనిగా సేవలందిస్తున్నారు.

వివా ది స్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి-తెనాలి:



ప్రదర్శనను తిలకిస్తున్న వివా చైర్మన్ విద్యాసాగర్

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వివా ది స్కూల్ నంబూరులో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 'గ్లోబల్ సైన్స్ ఫర్ గ్లోబల్ వెల్‌బీయింగ్' అంశానికి అనుగుణంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో విద్యార్థులు 180 పాఠ్యాంశాలపై తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యవసాయంలో నీటి యాజమాన్య పద్ధతులు, వాటర్ లెవల్ ఇండికేటర్స్, సోలార్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నమూనాలు, ఫింగర్ ప్రింట్ మిషన్, బాడీ వర్కింగ్ సిస్టమ్ వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనను తిలకించిన వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ నోబుల్ పురస్కార గ్రహీత సివి రామన్ 'రామన్ ఎఫెక్ట్'ను కనుగొన్న రోజును జాతీయ సైన్స్‌డేగా పాటిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎల్‌టి కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ చదలవాడ సరళ, ఐబి సమన్వయకర్త కె.మాధవి, సిబిఎస్‌ఈ సమన్వయకర్త జ్యోతి మెటిల్డా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి

మాచర్ల జెడ్‌పిటిసి మల్లు స్వామి - కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - మాచర్ల



పీజీ విద్యార్థిని డాక్టర్ ప్రీతి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రీతి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ పలనాడు గిరిజన సంఘం ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి జడ్పిటిసి మల్ల స్వామి మాట్లాడుతూ వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ లో పిజి చదువుతూ ర్యాగింగ్ భూతానికి గురై చనిపోవడం భాదాకరం అన్నారు. గిరిజన పిల్లలు ఉన్నత స్థానాలకు ఎదగడమే ఎంతో కష్టసాధ్యమైన పని అని అలా ఎదిగిన వారిని కూడా ర్యాగింగ్ పేరుతో అవమానపరిచి వారి మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రీతి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రభుత్వాలు ర్యాగింగ్ పట్ల కఠినమైన వైఖరి తీసుకొని బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం మూల్యాంకనం : ఆర్‌జెడి

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న ఆర్‌జెడి సుబ్బారావు

గుంటూరు మండల పరిధిలోని ప్రభుత్వ, మండలపరిషత్, ఎయిడెడ్, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం స్థానిక కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్య ఆర్‌జెడి వి.ఎస్. సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. విద్యాశాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థుల జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, విద్యార్థులకు మార్కులు తెలియజేయాలన్నారు. జవాబు పత్రాల్లో విద్యార్థుల తప్పులను గుర్తించి సరిచేయటానికి, కరెక్షన్ ఆఫ్ నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ కరెక్షన్ చేయాలని లేని ఎడల చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా ఇచ్చిన బైజ్యూస్ యాప్‌ను పూర్తి స్థాయిలో వినియోగించట్లేదని, ప్రతి రోజూ గంటపాటు వినియోగించేలా చూడాలన్నారు. మద్యాహ్న భోజనం పక్కాగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.శైలజ, గుంటూరు ఉప విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఉర్దూ డిఐ ఖాసిం, ఎంఇఒ ఎస్‌ఎంఎస్ అబ్దుల్ ఖుద్దూస్ పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతే భాష్యం లక్ష్యం

వార్షికోత్సవంలో చైర్మన్ రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు



వేడుకలను ప్రారంభిస్తున్న భాష్యం పేరమ్మ, రామకృష్ణ

భాష్యం స్థాపించిన నాటి నుండి 30 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో తల్లిదండ్రులు తమపై ఉంచిన భరోసా, బాధ్యతను భాష్యం విద్యాసంస్థలు నిలబెట్టుకుంటూ, విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేశాయని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. బుధవారం గోరంట్ల, భాష్యం టెన్త్ బాయ్స్ క్యాంపస్ ఆడిటోరియంలో భాష్యం విద్యా సంస్థల 30వ వార్షికోత్సవ వేడుకలు, చైర్మన్ భాష్యం రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ చిన్న పాఠశాలగా మొదలైన భాష్యం ప్రస్తానం నేడు రెండు తెలుగు రాష్ట్రాలో ఎన్నో బ్రాంచ్‌లు, లక్షకుపైగా విద్యార్థులతో విస్తరిస్తుందంటే దాని వెనుక ఎంతో నిబద్ధత, కృషి ఉన్నాయన్నారు. ఈ స్ఫూర్తిని ప్రతి ఒక్క విద్యార్థి అలవరుచుకొని, తమ లక్ష్య సాధన దిశగా ఏకాగ్రతను పెంపొందించుకొని జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. భాష్యం ఎదుగుదలలో భాగమైన ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. తొలుత భాష్యం రామకృష్ణ, ఆయన తల్లి భాష్యం పేరమ్మ చేతులమీదుగా జ్యోతిప్రజ్వలన ప్రారంభమైంది. సభకు వీరేంద్ర అధ్యక్షత వహించారు. అనంతరం భాష్యం రామకృష్ణ జన్మదిన కేక్‌ను భాష్యం విద్యాసంస్థల జెడ్‌ఈఓలు, ప్రిన్సిపాల్ సమక్షంలో కట్ చేశారు. ఈ సందర్భంగా భాష్యం గ్రూపు సంస్థల లోగోను రామకృష్ణ ఆవిష్కరించారు. చైర్మన్ రామకృష్ణను సిబ్బంది గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భాష్యం ఉపాధ్యాయులకు, సిబ్బందికి నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో భాష్యం డైరెక్టర్ భాష్యం హనుమంతరావు, ముఖ్య సలహాదారు మైఖేల్‌రాజ్ పాల్గొన్నారు.



భూతద్దం భాస్కరనారాయణ చిత్రం యూనిట్ వివిఐటిలో సందడి

ప్రజాశక్తి-తెనాలి:వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల్లో భూతద్దం భాస్కరనారాయణ చిత్రం యూనిట్ సందడి చేసింది. ఈనెల 30న విడుదల కానున్న చిత్రం ప్రమోషన్ నిమిత్తం కళాశాలకు వచ్చిన హీరో, హీరోయిన్లు శివ కందుకూరి, రాసి సింగ్‌లు విద్యార్థులతో కలిసి సందడి చేశారు. విద్యార్థులు కూడా వారితో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు, డ్యాన్స్‌లు చేశారు. దర్శకులు శివ పురుషోత్తం మాట్లాడుతూ చిత్రం ట్రైలర్‌కు విశేష స్పందన లభించినట్లు చెప్పారు. హీరో మాట్లాడుతూ చిత్రం అన్ని వర్గాల ఆదరణ పొందుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్మాతలు స్నేహల్ జంగాల, శశిధర్ కాశి, వివిఐటి ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

పల్నాడులో రూ.3.32 కోట్లతో 27 శుద్ధ జలకేంద్రాలు

ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు ప్రాంతంలో తాగు నీటి సమస్య పరిష్కారమే తన లక్ష్యమని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్లమెంట్ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేశారు. మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో 37 వాటర్ ప్లాంట్ల నిర్మానానికి రూ. 3.32 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు నిధుల కోసం పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ను అభ్యర్థించిన నేపథ్యంలో రూ. 2.49 కోట్లు అందించగా ప్రాజెక్టు నిర్మాణంలో 25శాతం నిధులు (రూ.83లక్షలు) ఎంపీ నిధుల నుండి అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి బుధవారం జిల్లా పరిపాలన విభాగం నుండి ఉత్తర్వులు విడుదలయ్యాయన్నారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగం ద్వారా ఈ పనిని చేపట్టనుంది. షెడ్డు నిర్మాణానికి భూమిని ఉచితంగా అందించడం, ప్రాజెక్ట్ పూర్తైన తర్వాత వ్యవస్థ నిర్వహణలో నీటి, పారిశుధ్య కమిటీలతో పాటు గ్రామ పంచాయితీలు ఆర్‌ఓ వ్యవస్థలను నిర్వహిస్తాయన్నారు.